## సింగిల్ పేజీ కథలు

# అద్దం

సుందరి అద్దం ముందు నిలబడింది. చామనచాయ, పొడుగూ, పొట్టీ కాని రూపం. మరీ అంత రూపసీ కాదు. అలాగని అనాకారీ కాదు. కానీ... వేణు ఎందుకు అలా అన్నాడు? ఆలోచిస్తుంటే ఆ రోజు సాయంత్రం జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది. తనకి రోజూ సాయంత్రం డాబా మీదికి ఎక్కి అలా గోడమీదికి పాకిన సన్నజాజి తీగ నుండి పూలు కోసి అక్కడే కూర్చుని మాలకట్టి కాసేపు అటూ ఇటూ తిరిగి కిందికి దిగివచ్చి చదువుకోవటం అలవాటు. డాబా మీదకు ఎక్కితే ట్రిమ్ముగా తయారయ్యి మేడ మీద ఉన్న గదిలోకి ఇంత లావు పుస్తకాలు రెండు పట్టుకుని చదువుకుంటున్నట్లు నటిస్తూ, రోడ్డు మీద పోయే ఆడపిల్లలకు బీటు కొట్టే పక్కింటి సుబ్బారావు కనపడతాడు. పక్కపక్క ఇళ్లే అని కానీ, వాళ్ల చెల్లెలు తన ఫ్రెండే అన్న భయంతో కానీ సుబ్బారావు తన జోలికి మాత్రం రాడు.

అరే! ఆలోచనల్లో పడి రేపటి ఎస్సైన్‌మెంట్ గురించి మర్చిపోయానే అనుకుంటూ ఎకనామిక్స్ బుక్ తీసింది. జాతీయాదాయాలు, తలసరి ఆదాయాలు, క్షీణోపాంత సిద్ధాంతము అవన్నీ చదివింది. బుర్రకెక్కకపోయినా చదువుతూనే ఉంది. మనసు కోతి కదా. దాని పని అది చేసుకుపోతునే ఉంది. మళ్లీ మళ్లీ సాయంత్రం జరిగిన సంఘటన వైపుకే లాక్కెళ్తోంది.

ఆ రోజు శుక్రవారమైతే తలంటి స్నానం చేసింది. కాలేజీకి ఎప్పుడూ లేంది పట్టులంగా, ఓణీ వేసుకెళ్లింది. సాయంత్రం అలాగే మేడ మీదకి వెళ్లి సన్నజాజులు కోస్తోంది. అవతలి వైపు డాబా మీద సుబ్బారావుగాడు సీరియస్‌గా చదువుతున్నట్లు నటిస్తూ అటుపక్క మేడమీద సంగీతం నేర్పుతున్న లక్ష్మి టీచర్ వైపు దొంగచూపులు చూస్తున్నాడు. వాడి ముదురు మొహం, గుంట కళ్లు చూస్తే ఏ ఆడపిల్లయినా వాడికి పడుతుందా అనేది సుందరికి పెద్ద సందేహం. అదే సమయానికి సుబ్బారావుకి దూరపు బంధువు వేణు వచ్చాడు.

కీచైన్ గిరగిరా తిప్పుతూ, బూట్లు టకటక లాడించుకుంటూ మేడ మీదకి వచ్చి ''హాయ్! సుబ్బా! అంజి సినిమాకి టిక్కెట్లు తెచ్చాను వస్తావా!'' అంటూ గలగలా మాట్లాడుతున్న వాడల్లా హఠాత్తుగా ఆగిపోయి ''హలో! సుందూ! ఈ డ్రెస్‌లో నువ్వెంతో బాగున్నావు. రియల్లీ యు ఆర్ వెరీ వెరీ బ్యూటిఫుల్'' అన్నాడు. సుందరికి ఒక్కసారిగా గుండె గతుక్కుమన్నట్లయింది. అంత డైరెక్ట్‌గా అలా అనేస్తాడని తను అస్సలు ఊహించలేదేమో. చాలా కంగారు పడిపోయింది. అతనితో ముఖపరిచయం ఉంది. తన ఫ్రెండ్ శిరీష కోసం సుబ్బా



వాళ్లింటికి వెళ్లినప్పుడు ఎప్పుడైనా వస్తే పలకరించేవాడు. అడిగినదానికి జవాబు చెప్పేది తప్పితే మాటలు పెంచేది కాదు. అలాంటిది ఈరోజు ఇంత చనువుగా సుందూ అనటం, అందంగా ఉన్నావనటం ఆమె కన్నెమనసుకి ఆశ్చర్యంగా అయోమయంగా అనిపించింది. దడదడలాడుతున్న గుండెతో బదులు కూడా చెప్పకుండా కిందికి దిగివచ్చేసింది. అదిగో! అప్పటినుండీ ఇదే తంతు!

మనస్సుకి ఎంత గట్టిగా కళ్లాలు వేద్దామనుకున్నా కుదరడం లేదు. లోపలినుండి అలలు అలలుగా ఎగిసి వస్తున్న సంతోషానికి అడ్డుకట్ట వేద్దామన్నా కుదరడం లేదు సుందరికి. అతి సామాన్యంగా ఉండే తాను, అంతా లవర్ బాయ్ అని చెప్పుకునే వేణుకి నచ్చటం చాలా అద్భుతంగా అనిపిస్తుంది. మళ్లీ మళ్లీ అవే మాటలు అతను తన చెవిలో అంటున్నట్లు వినిపిస్తోంది. తనని ఎప్పుడూ ఎవరూ అలా మెచ్చుకోలేదు. సుందరి నెమ్మదైన పిల్ల. కష్టపడి చదువుతుంది అన్న మాటలు తప్ప తనకు వయసు వచ్చిన దగ్గర్నుంచీ ఎవరూ అందం గురించి ప్రస్తావించలేదు. అలాంటిది అంత అందగాడైన వేణు అలా మెచ్చుకోవడంతో ఆమె కన్నెమనసు ఊహల లోకంలో ఎగిరిపోసాగింది. తనని వేణు ప్రేమిస్తున్నాడేమో అనుకునేసరికి అంతకుముందు జరిగినవన్నీ తన కోసమే జరిగినట్లు అనిపించసాగింది.

తనూ, వేణూ పార్కుల్లో సినిమాల్లోని ప్రేమికుల మాదిరి తిరిగినట్లు, అది చూసి నాన్న తనని ఇంట్లో బంధించినట్లు ఒకరోజు హీరోలాగా వేణు నలుగురి కుర్రాళ్లతో ఇంట్లోకి వచ్చి నాన్నని బెదిరించి తనని తీసుకెళ్లినట్లు ఏవేవో ఊహలు వచ్చాయి. తను అలా వెళ్లిపోయినందుకు అమ్మా, నాన్న అవమానంతో తలెత్తుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు, దిక్కులేనిదానిలా తన చెల్లెలు రోడ్డుమీద వెళుతుంటే నలుగురు గుండాలు వచ్చి ఆమెని ఎత్తుకుపోయినట్లు ఇవన్నీ ఊహలు వస్తుంటే సుందరికి ఆ రాత్రి నిద్ర పట్టలేదు. ఆలోచనలు ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే తట్టుకోలేక నిద్రపట్టక బైటకి వచ్చి నిలబడింది. పక్క వీధిలో ఏదో గుళ్లో హరికథా కాలక్షేపం జరుగుతోంది కాబోలు, శాస్త్రిగారు బుద్ధుని గురించి చెబుతూ, ''నీవు చాలా సమర్థుడివి, తెలివైనవాడివి అంటూ ఎవరైనా మన గురించి పొగిడితే మనం ఏమనుకుంటాం? నాకు చాలా విషయాలు తెలుసునని ఇతడు అంటున్నాడు. నా తెలివితేటలకి అబ్బురపడుతున్నాడు. తనకా తెలివితేటలు లేనందుకు అసూయపడుతున్నాడు. అలా ఒక్కమాటకి ఎన్నో మాటల్ని మనమే ఊహించుకుంటాం. కానీ, ఇక్కడ బుద్ధుడేమి అంటున్నాడు? మన మనస్సు కనక నిర్మలంగా, అద్దంలా ఉంటే అప్పుడు ఎదుటి వ్యక్తి చెప్పిన ఒక్కమాటే వినిపిస్తుంది. ఒక్క అర్థమే గోచరిస్తుంది. కనుక...'' అంటూ ఇంకా ఏవేవో చెబుతున్నాడు.

సుందరికి మాత్రం తన మనస్సు చేసే గందరగోళానికి సమాధానం దొరికినట్లు అనిపించింది వెంటనే. తన మనస్సుని వెంటనే అద్దంలా శుభ్రం చేసుకోవాల్సిన అవసరమూ కనిపించింది కూడా.

**-బి. యామిని (గుంటూరు)**